
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

బుధవారం 17 సెప్టెంబరు 2025

ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్ రద్దు



- బాధితులకు న్యాయం చేసిన ఆర్డీవో సాయిశ్రీ
- సంతోషం వ్యక్తం చేసిన బాధితులు

7

యూరియా బస్తాపై
రూ.84 అదనం?

- రైతుల గగ్గోలు

చాపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూరియా అమ్మకాల్లో ప్రభుత్వం చెబుతున్న ధరకు, డీలర్లు విక్రయిస్తున్న ధరకు ఏమాత్రం సంబంధం లేదు. ప్రభుత్వం ఒక బస్తా రూ.266కు విక్రయించాలని చెబుతోంది. కానీ ఫెర్టిలైజర్ డీలర్లు రూ.350కి విక్రయిస్తున్నారు. ఒక బస్తాపై రూ.84 ఎక్కువగా ఉండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

యూరియా సరఫరా చేసేందుకు జిల్లాస్థాయిలో అయిదుగురు హోల్‌సేల్ డీలర్లు కడప, ఖాజీపేట, ప్రొద్దుటూరు పట్టణాల్లో ఉన్నారు. చాపాడు మండలానికి ప్రొద్దుటూరులోని డీలర్ సరఫరా చేస్తున్నారు. ఒక బస్తా రూ.320లకు సరఫరా చేస్తున్నారని అంటున్నారు. ఇంకా రవాణా ఖర్చు, కూలి ఖర్చులు, పెట్టుబడి, వడ్డీ అంటూ లెక్కలేసి రూ.350లకు విక్రయిస్తున్నారు. అంటే ఒక బస్తాపై అదనంగా రూ.84 తీసుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఒక బస్తా రూ.266లకు అమ్మడం, ప్రైవేటు దుకాణాల్లో రూ.350లకు అమ్మడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని అధికారులు ఇప్పటికే సుమారు 1200 టన్నుల యూరియాను రైతులకు విక్రయించారు. ఇందులో 40 శాతం మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. 60 శాతం ప్రైవేటు డీలర్లు పంపిణీ చేశారు. అధిక ధరలకు విక్రయించవద్దంటూ వ్యవసాయాధికారులు ప్రైవేటు దుకాణాలపై దాడులు చేస్తున్నారు. అయినా అధిక ధరలకే విక్రయిస్తున్నారు. ఈ విషయమై చాపాడు మండల వ్యవసాయాధికారిణి దేవీపద్మలతను వివరణ కోరగా.. ప్రైవేటు డీలర్లకు రవాణా ఖర్చులు, కూలి ఖర్చులు ఉన్న మాట నిజమేనన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

36,915.26 టన్నుల ఎరువులు సరఫరా

కడప రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ 2025కు సంబంధించి 69,653 టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటివరకు 36,915.26 టన్నులు సరఫరా చేశామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ తెలిపారు. ఇంకా జిల్లాలో 25,170.97 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో యూరియా 2,117.80 టన్నులు, డీఏపీ 3,268 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 15,727.59 టన్నులు, యంఓపి ఎరువులు 1,990.80 టన్నులు, ఎస్ఎస్‌పీ 2,066.79 టన్నులు ఉన్నాయన్నారు. మంగళవారం జిల్లాకు మరో 1050 టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని జిల్లాలోని రైతు సేవా కేంద్రాలకు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేశామన్నారు. సాగుచేసిన పంటలకు అవసరం మేరకు యూరియా సరఫరా అవుతుందన్నారు.


పద్మా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఉత్తర్వుల మేరకు 2026 పద్మా అవార్డులు (పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ)లకు సామాజిక సేవా రంగంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈవో విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీలోపు పోస్టు ద్వారా గానీ నేరుగా గానీ సమర్పించాలని, ఏడబ్ల్యుఈఆర్ డీఎస్.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా చేసుకొనే వెసులుబాటు ఉందని తెలిపారు. అర్హులైన వారి నామినేషన్లను కలెక్టర్ ఆమోదంతో తదుపరి చర్య తీసుకుంటామని, వివరాలకు స్టెప్ మేనేజర్ వీవీ సుబ్బరాయుడు 9949298810 నెంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.

కేసీ కెనాల్ ఆక్రమణల వ్యవహారంలో..
17 మందిపై
విచారణ



- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- పోలీసు శాఖకు చెందిన ముగ్గురికి మినహాయింపు
- విచారణాధికారిగా జేసీ అదితి సింగ్
- చివరి దశకు చేరుకున్న రూ.50 కోట్ల విలువైన ఐదెకరాల కబ్జా కేసు



కలికిరి /కడప, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విలువైన కేసీ కెనాల్ భూముల ఆక్రమణ వ్యవహారం చివరి దశకు చేరుకుంటోంది. 2019 మే 21న విజిలెన్స్ విచారణ పూర్తి చేసి నివేదిక ప్రభుత్వానికి అందజేసినా ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం దీన్ని మూలన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దీనిపై చర్యలకు ఉపక్రమించింది. తాజాగా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకునేందుకు చివరిసారిగా మరో విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేసీ కెనాల్‌కు చెందిన రూ.50 కోట్ల విలువ చేసే 5 ఎకరాల ఆక్రమణకు కారకులైన 17 మందిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

మొదట గత ఏడాది అక్టోబరు 30న ముగ్గురు పోలీసు అధికారులతో సహా మొత్తం 20 మందిపై విచారణ జరపాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం దీనికి కొనసాగింపు అధికారులు పాల్పడ్డ అక్రమాల వివరాలను జతను చేస్తూ సంజాయిషీలు చెప్పుకునేందుకు అవకాశమిస్తూ నవంబరు 13 చార్జి నోటీసులు జారీ చేసింది. వీరు సమర్పించుకున్న సంజాయిషీలేవీ సమంజసంగా లేకపోవడంతో తాజాగా విచారణ చేయించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులిచ్చింది. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, పోలీసు శాఖకు చెందిన మొత్తం 20 మంది అధికారులపై చర్యలు తీసుకోవాలని గతంలో విజిలెన్స్ నివేదికలో సిఫారసు చేశారు. ప్రస్తుతం ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలను మాత్రం ఈ విచారణ నుంచి మినహాయించారు. మిగిలిన 17 మందిపై విచారణ కొనసాగనుంది. విచారణను ఎదుర్కొంటున్న వారిలో ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మరో ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు, నలుగురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, ఒక ఎంపీడీవో స్థాయి అధికారి ఉండటం విశేషం. ప్రస్తుతం విచారణాధికారిగా కడప జేసీ అదితీ సింగ్‌ను ప్రభుత్వం నియమించింది. విచారణలో ఆమెకు సహకరించడానికి కడప డీఆర్వో ఎం.విశ్వేశ్వరనాయుడును ప్రెజెంటింగ్ అధికారిగా ఏర్పాటు చేసింది.

కేసీ కెనాల్ ఆక్రమించి.. విజయదుర్గా కాలనీ..

గతంలో దోషులుగా చెపుతున్న వారికి జారీచేసిన నోటీసుల మేరకు కేసీ కెనాల్ భూములు ఆక్రమించిన తీరు గురించి ప్రభుత్వం కూలంకషంగా వివరించింది. కడప కేసీ కెనాల్‌కు సంబంధించిన కాలువ పక్కన ఉన్న గూడూరు గ్రామానికి చెందిన పలు సర్వే నెంబర్లలోని కాలువ కట్ట పోరంబోకు భూములను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ మాఫియా విజయదుర్గ కాలనీ పేరుతో వెంచర్లు వేసింది. దీనికోసం కొత్త రామరాజుపల్లె వద్ద కేసీ కెనాల్ సైఫన్‌ను కూడా కూల్చేసి సిమెంటు రోడ్లు వేశారు. వైఎస్సార్ సీఎంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో అంటే 2004 జూలైలో ఈ ఆక్రమణలు మొదలు పెట్టారు. ఆక్రమణలను అడ్డుకోవడంలోనూ, ఇండ్ల స్థలాల అభివృద్ధిని నిరోధించడంలోనూ, ప్లాట్లను యథేచ్ఛగా అమ్ముతున్నా నిరోధించడంలోనూ జలవనరుల శాఖ, కడప మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చినా ఆక్రమణలను తొలగించే ప్రయత్నాల సంగతెలా ఉన్నా రూ.కోట్లు ఖర్చు పెట్టి విజయదుర్గ లేఔట్‌కు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. బఫర్ జోన్ల నియమాలు కూడా పట్టించుకోకుండా కార్పొరేషన్ అధికారులు ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు కూడా జారీ చేశారు. కనీసం బెటర్‌మెంట్ చార్జీలు కూడా వసూలు చేయలేదు. మైదుకూరుకు చెందిన కొంతమంది ఆయకట్టు రైతులు, కడప బీజేపీ నాయకుడు ఎల్.రామమోహన్ రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటుకు ఫిర్యాదు చేశారు. ఆపై కోర్టుకెక్కారు. ఈ నేపథ్యంలో అప్పుడు విజిలెన్స్ శాఖ విచారణకు మాత్రం ఆదేశించారు. ఈ వ్యవహారం 2014 వరకూ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం దీన్ని తిరిగి లోతుగా పరిశీలించేందుకు చర్యలు తీసుకుంది. అన్ని అడ్డంకులు అధిగమించి 2019 మే 25న విజిలెన్స్ నివేదికను ప్రభుత్వానికి అందజేసిన వెంటనే కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. ఆ తరువాత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇది పూర్తిగా తెరమరుగయింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసీ కెనాల్ ఆక్రమణల భాగోతం వెలుగులోకి వచ్చింది. దీన్ని తుది దశకు చేర్చేందుకు తదనంతరం చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసింది.

బాధ్యులైన అధికారులు..

కేసీ కెనాల్ భూముల ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారంలో రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్లుగా ఉన్న అప్పట్లో వేంపల్లె తహశీల్దారు ఎ.శ్రీనివాస్, కడప తహశీల్దార్లు ఎన్.రవిశంకర్ రెడ్డి, ఎస్.ప్రేమనాథకుమార్, జడ్పీ సూపరింటెండెంట్ ఎన్.శివరామిరెడ్డి, జలవనరుల శాఖ కేసీ కెనాల్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్.సుధాకర్, ఇ.మల్లికార్జున, కె.సుబ్బయ్య, డీఈ ఎస్.జిలానీ బాషా, కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన అప్పటి కమిషనర్లు ఎస్.అలీం బాషా, డి.జాన్ శాంసన్, సి.ఓబులేశు, పి.చంద్రమౌళీశ్వర రెడ్డితోపాటు కార్పొరేషన్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన బి.విజయభాస్కర్ రెడ్డి, టి.ఎం.రహ్మాన్, జి.నాగశివప్రసాద్, జి.శారదాంబ, సి.టి.కృష్ణ సింగ్‌లపై ప్రస్తుతం విచారణ జరగనుంది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులున్న నేపథ్యంలో విచారణను రెండు నెలల్లోగా పూర్తిచేసి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులకు వాట్సప్ గ్రూపులు

- కలెక్టర్‌కు సీఎం ప్రశంస
- రాష్ట్రవ్యాప్తంగా అమలు
- గాలేరు నగరి, స్టీలు ఫ్యాక్టరీ 2027 నాటికి పూర్తిచేయాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



కలెక్టర్ల సదస్సుకు హాజరైన కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల కోసం ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపుల ఆలోచన బాగుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండోరోజు మంగళవారం కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. జిల్లా గురించి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వివరించారు. రైతులకు సలహాలు, సూచనలు, పంటల సాగులో మెళకువల కోసం పంటల వారీగా రైతులకు వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేశామన్నారు. ఉల్లి, అరటి, మామిడి, బత్తాయి ఇలా పంటలవారీగా రైతులతో గ్రూపులు ఏర్పాటు చేశామని అలాగే ఉల్లి కొనుగోలు కోసం కూడా గ్రూపులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేయాల్సిందిగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. గాలేరు నగరి రెండో దశ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు భూసేకరణ ఇతర పనులు చేయాలన్నారు. మహానాడు సందర్భంగా గాలేరు నగరికి వెయ్యికోట్లు కేటాయించినట్లు సీఎం వివరించారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక జమ్మలమడుగు వద్ద నిర్మించనున్న స్టీలు ఫ్యాక్టరీని 2027 చివరినాటికి పూర్తిచేయాలని, అందుకు అవసరమైన రోడ్లు, నీరు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన స్మార్ట్ కిచెన్ సెంటర్లు బాగున్నాయంటూ సీఎం కలెక్టర్‌కు కితాబిచ్చారు. ఐదు కిచెన్ సెంటర్లు ప్రారంభించారని, జిల్లా వ్యాప్తంగా వీటిని నిర్మిస్తున్నారని రాష్ట్రంలో అన్నిచోట్లా ఇలానే నిర్మించాలని ఆదేశించారు.

సర్వీసు సెక్టార్‌లో 'ఏ' గ్రేడ్

రెండురోజుల పాటు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో జిల్లాల వారీగా తలసరి ఆదాయం పెంపుపై చర్చించారు. అందులో భాగంగా జిల్లా ఏ యే రంగాల్లో వృద్ధి సాధిస్తుందో వివరించారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.73,217 కోట్ల లక్ష్యానికి గాను తొలి క్వార్టర్‌లో రూ.13,109 కోట్లు సాధించాల్సి ఉంది. స్వర్ణాంధ్ర జిల్లాల్లో చూస్తే మన జిల్లాకు 62 పాయింట్లతో బీ గ్రేడ్ దక్కింది. వ్యవసాయపరంగా చూస్తే హార్టికల్చర్‌కు సంబంధించి అరటి, టమోటా ఇతర వ్యవసాయ ఉత్పత్తులను 720 టన్నులు ఎగుమతి చేయాలనుకున్నారు. హార్టికల్చర్‌లో లింగాల మంచి ఫలితాలు సాధిస్తోంది. సర్వీసు సెక్టారులో 76 పాయింట్లతో 'ఏ' గ్రేడ్‌లో నిలిచింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో 27 పాయింట్లతో సీ గ్రేడ్‌లో నిలిచింది. పండ్లతోటలలో లింగాల మండలం కొమ్మన్నూతలలో దిగుబడి గురించి ప్రస్తావించారు. ఇక స్వచ్ఛాంధ్రలో కడప కార్పొరేషన్‌కు స్మార్ట్‌సిటీగా అవార్డులు వచ్చాయి. కాగా.. రెండోరోజు సదస్సులో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సైతం పాల్గొన్నారు.

నేడు యాత్రి సేవా దివస్

- విమానాశ్రయం విస్తరణకు చర్యలు
- ఏప్రిల్‌లో అందుబాటులోకి దేశీయ టెర్మినల్ భవనం
- కడప విమానాశ్రయం డైరెక్టర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడప విమానాశ్రయం డైరెక్టర్ సుజిత్‌కుమార్

కడప ఎన్జీఆర్ సర్కిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయంలో బుధవారం యాత్రి సేవా దివస్ నిర్వహించనున్నామని కడప విమానాశ్రయ డైరెక్టర్ సుజిత్‌కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం స్థానిక విమానాశ్రయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రణాళిక ప్రకారం కడప విమానాశ్రయంలో ప్రయాణించే వారికి తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు రక్తదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు డ్రాయింగ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు కడప విమానాశ్రయంలోని టెర్మినల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

కడప విమానాశ్రయం రెండో ప్రపంచ యుద్ధం నాటిదన్నారు. దీనిని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసి 2015 జూన్ 7న వాణిజ్య విమానాల రాకపోకలను ప్రారంభించిందన్నారు. మొదట కడప-బెంగళూరు మార్గంలో ఎయిర్ పెగసెస్ ద్వారా విమానాలు నడిపారని తరువాత ట్రూజెట్ ఎయిర్‌లైన్స్ 2017లో ఉడాన్ ఆర్‌సీఎస్ కింద చెన్నై, హైదరాబాదు, విజయవాడ, బెల్గాం నగరాలను అనుసంధానంగా విమాన సర్వీసులు ప్రారంభించిందన్నారు. ఆ తరువాత ఇండిగో ఎయిర్‌లైన్స్ కడప నుంచి బెంగళూరు, చెన్నై, విజయవాడ, విశాఖ, హైదరాబాదు వంటి ప్రధాన నగరాలకు రెగ్యులర్ సర్వీసులను నడుపుతోందన్నారు. డిమాండ్‌ను పరిగణన లోకి తీసుకుని ఇటీవల కడప విమానాశ్రయాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఏ321 విమానాల కోసం మొత్తం ఏడు పార్కింగ్ బేలు 2022 అక్టోబరులో ప్రారంభించామన్నారు. ఏ321 విమానాలు ఉంచడానికి వీలుగా 1719 మీటర్ల నుంచి 2515 మీటర్ల వరకు రన్‌వేను విస్తరించి 2023 ఫిబ్రవరిలో ప్రారంభించామన్నారు. ప్రస్తుతం వేయి చదరపు మీటర్ల నుంచి 2500 చదరపు మీటర్ల వరకు టెర్మినల్ ఉందని దీనిని 16,455 చదరపు మీటర్ల మేర విస్తరించనున్నట్లు తెలిపారు. 1800 మంది ప్రయాణికుల రద్దీ సామర్థ్యానికి అనుగుణంగా నూతన టెర్మినల్ ఉంటుందన్నారు. నూతన దేశీయ టెర్మినల్ భవనం 2026 ఏప్రిల్‌లో అందుబాటులోకి వస్తుందన్నారు. కడప విమానాశ్రయంలో రాత్రి ల్యాండింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

రూ.6లక్షలు ఇస్తేనే..

- కార్పొరేటర్ భర్త హుకుం
- సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో పనులను అడ్డుకున్న వైనం



కార్పొరేటర్ భర్త బెదిరించడంతో షెడ్డులో ఉన్న సామాన్లు తీసుకెళుతున్న కూలీలు

(కడప-ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు కావస్తున్నా ఇంకా వైసీపీ నేతల ఆగడాలు, బెదిరింపులు మారడం లేదు. కడప కార్పొరేషనులో అయితే కొందరు కార్పొరేటర్ల ఆగడాలకు అంతే లేకుండా పోయింది. ఆ ప్రాంతానికి వారే రాజు, వారు చెప్పిందే వేదం అనేలా వ్యవహరిస్తున్నారు. ఆయా డివిజన్లలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా వీరికి కప్పం కట్టాల్సిందే.

ఎర్రముక్కపల్లెలో సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో అదనపు భవనాలను రూ.3.66 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఏవీ మోహన్‌రెడ్డి అనే వ్యక్తికి కాంట్రాక్టు దక్కించుకున్నాడు. ఉత్తరప్రదేశ్, బీహార్‌కు చెందిన కూలీలు అక్కడ పనిచేస్తున్నారు. అయితే ఒక కార్పొరేటరు భర్త డబ్బులు డిమాండ్ చేస్తూ నిర్మాణ పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. రూ.6లక్షలు ఇవ్వాలని లేదంటే మీ కథ చూస్తామని బెదిరింపులకు పాల్పడుతూ వస్తున్నారని చెబుతున్నారు. అక్కడ పనిచేస్తున్న కూలీలు నివాసం ఉండేందుకు వేసుకున్న షెడ్డును ఖాళీ చేయాల్సిందిగా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు కాంట్రాక్టరు ఏతి మోహన్‌రెడ్డి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. "21వ డివిజను కార్పొరేటరు ఎం.సుజాత భర్త సుబ్బరాయుడు పనులు చేస్తున్న కూలీల వద్దకు వచ్చి పనులు నిలిపివేయాలని బెదిరించాడు. కాంట్రాక్టు పనులు చేస్తున్నందుకు తనకు రూ.6లక్షలు డబ్బు ఇవ్వాలని కూలీలను బూతులు తిడుతున్నాడు. చీటికీ మాటికీ వచ్చి కూలీలను కులం పేరుతో దూషిస్తూ పనులు నిలిపివేయాలని లేదంటే షెడ్డు కూల్చివేస్తామని బెదిరించాడు" అంటూ ఫిర్యాదు చేశారు. సుబ్బరాయుడు నుంచి తమకు, తమ వర్కర్లకు, షెడ్డుకు రక్షణ కల్పించాలని కోరారు. డబ్బులు అడుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ, ప్రభుత్వ లైబ్రరీ నిర్మాణ పనులు అడ్డుకుంటున్న అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. అలాగే సీఎం చంద్రబాబుకు, డీజీపీ, ఎస్పీ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కాగా మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సుబ్బరాయుడుపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళను మోసం చేసిన కేసులో
నిందితుడికి జీవిత ఖైదు

- రూ.80 వేలు జరిమానా


ఓబులవారిపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళను మోసం చేసిన కేసులో నిందితు డికి జరిమానాతో పాటు, జీవితఖైదు ఖరారు చేస్తూ కోర్టు తీర్పునిచ్చిం ది. మండలంలోని రాళ్లచెరువుపల్లె కొత్తపల్లెకు చెందిన 22 ఏళ్ల మహిళతో పాపిరెడ్డిపల్లెకు చెందిన దాంట్ల విజయ్‌కుమార్ సహజీవనం చేశాడు. పెద్దఓరంపాడులోని సిద్దులయ్యస్వామి దేవాలయం వద్ద వివాహం జరిగినట్లు ఆ గ్రామ పెద్దలను నమ్మించాడు. గ్రామ పెద్దలు ఈ విషయంపై విచారణ చేయగా అప్పటికే విజయ్‌కుమార్‌కు వేరొక మహిళతో వివాహమైన విషయం బయట పడింది. ఈ నేపథ్యంలో గర్భిణిగా ఉన్న మహిళ మెడలోని తాళిబొట్టు కాళ్లమెట్టెలు బలవంతంగా లాక్కుని.. కడుపులో ఉన్న బిడ్డను చంపేస్తానని బెదిరించడంతో బాధితురాలు 2020లో ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ప్రస్తుతం కడపలోని ఏడవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి రమేష్‌కుమార్ సెక్షన్ 376(2)(ఎన్), 493, 496, 420 ఐపీసీ ప్రకారం నిందితుడికి రూ.80 వేల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేశ్ తెలిపారు. ఈ కేసును తక్కువ సమయంలో పరిష్కరించినందుకు పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందం, కోర్టు పోలీసులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అభినందించారని ఎస్ఐ తెలిపారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు మస్కా

- రూ.10లక్షలతో రీసోర్స్ పర్సన్ పరార్
- పోలీసులను ఆశ్రయించిన సంఘం సభ్యులు

7

పెన్నా ఒయ్యారం.. పొలం సింగారం





ఇటీవల కురిసిన వర్షాలకు బీడు భూములు.. కొండలు పచ్చదనం సంతరించుకున్నాయి. ఎగువ నుంచి వరద రావడంతో పెన్నా పరవళ్లు తొక్కుతోంది. పెన్నా పరీవాహక ప్రాంతమంతా వరిపైరుతో పచ్చగా కళకళలాడుతోంది. సిద్దవటం మండలం లింగంపల్లి, బండికనుమ ప్రాంతాలు సంధ్యవేళ ప్రకృతిప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఒంపుసొంపులతో ఒయ్యారంగా ప్రవహిస్తున్న పెన్నానది.. కనుచూపుమేరా పచ్చదనం సింగారించుకున్న పుడమితల్లి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రకృతి అందాలను వీక్షించేందుకు పలువురు ఇక్కడకు వస్తున్నారు.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ఆదర్శరైతుకు జీవిత సాఫల్య పురస్కారం



ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ వ్యవసాయ శాస్త్ర సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఆసియా పీజీపీఆర్ (మొక్కల పెరుగుదలను ప్రోత్స హించే రైజో బ్యాక్టీరియా) జాతీయ సదస్సులో కోడూరు ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి ప్రతినిధులు, యూఎస్ఏ, యూకే, హంగేరి వంటి దేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. మొక్కల పెరుగుదలను ప్రోత్సహించే రైజో బ్యాక్టీరియా అంశంపై జరిగే ఈ సదస్సు, కొత్త ఆవిష్కరణలు, పరిశోధన ఫలితాలు, భవిష్యత్తు అవకాశాలపై చర్చించడానికి ఒక వేదికగా నిలిచింది. ఆదర్శ రైతు జి.వెంకటరామరాజు వ్యవసాయ రంగంలో, ముఖ్యంగా పీజీపీఆర్ పరిశోధన, అభివృద్ధిలో చేసిన అసాధారణ కృషి, రైతులకు అందించిన మార్గదర్శకత్వం, కొత్త సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావడంతో ఆయన పోషించిన ప్రముఖ పాత్ర గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. కోడూరు ప్రాంతానికి అరుదైన గౌరవం తీసుకొచ్చిన ఆదర్శ రైతు రామరాజుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ప్రాణహాని ఉంది.. రక్షించండి

- అడిషనల్ ఎస్పీకి సీపీఐ నేత మొర



సెల్వన్‌కుమార్ భార్యను విచారిస్తున్న ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే

పుల్లంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారుల నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ మండల పరిధిలోని దళవాయిపల్లె హరిజనవాడకు చెందిన మండల సీపీఐ కార్యదర్శి సెల్వన్ కుమార్ భార్య ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు రోజుల క్రితం ఆ కుటుంబంపై దాడి చేసినట్లు నమోదైన కేసుపై మంగళవారం రాజంపేట అడిషనల్ ఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే దళవాయిపల్లె హరిజన వాడలో విచారణ చేశారు. ఈ సందర్భంగా దాడికి కారణాలను, ఎంతమంది పాల్గొన్నారు. ఏ సమయంలో జరిగింది అనే విషయాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సెల్వన్ కుమార్ భార్య మాట్లాడుతూ తమకు ప్రాణ భయం ఉందని కాపాడాలని మొరపెట్టుకున్నారు. మీరు భయపడవద్దని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, మళ్లీ ఇటువంటి సంఘటనలు జరగకుండా చూస్తామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. దాడిలో దెబ్బతిన్న బైకు, ఆటో, కారును కూడా ఆయన పరిశీలించారు. అనంతరం బాధితులను పుల్లంపేట స్టేషన్‌కు పిలిపించి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. సీఐ బీవీ రమణ, ఎస్ఐ శివకుమార్‌లు పాల్గొన్నారు.

టమోటాలను గిట్టుబాటు ధరకు కొనండి

- మార్కెట్ కమిటీ కార్యదర్శి సూచన



సూచనలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): టమోటాలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. టమోటా ధరలు తగ్గిపోవడంతో మార్కెటింగ్ శాఖ కమిషనర్ సునీత ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో టమోటా కొనుగోలు చేసే బయటి రాష్ట్రాల వ్యాపారులతో మాట్లాడుతూ రైతులు నాణ్యమైన టమోటాలు మార్కెట్‌కు తీసుకొస్తున్నారని, మంచి ధరలకు టమోటాలు కొనుగోలు చేయాలన్నారు. అక్టోబరు మొదటి వారంలో టమోటా ధరలు పెరిగే అవకాశం ఉందని కార్యదర్శికి తెలియజేశారు. సమావేశంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, కర్ణాటక గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మిశ్రా, విక్రమ్, జగదీష్, గోవిందు, శంకర్, సనావుల్లా, రఫిక్, రాజుభాయ్, మింటు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3,93,869

నందలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,93,869 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. 30 రోజుల అనంతరం హుండీని లెక్కించామని, వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

షరతులు లేని వాహనమిత్ర అమలు చేయాలి

- ఏఐటీయూసీ నేతల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా ఆటో నడిపే ప్రతి డ్రైవర్‌కు వాహనమిత్ర పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ముబారక్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వాహనమిత్ర రూ.15 వేలు ఇస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహనమిత్ర పథకం అన్నారు. ఇప్పుడేమో ఓనర్ కమ్ డ్రైవర్‌కు అంటున్నారు. రాష్ట్రమంతా పెద్ద ఎత్తున జరుగుతున్న ఆటో డ్రైవర్ల ఉద్యమాన్ని చల్లార్చడం కోసం వాహనమిత్ర పథకం అమలు తేదీ ప్రకటించారన్నారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు 50 శాతం సబ్సిడీతో విద్య, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు, చంద్రన్న బీమా ద్వారా సహజ మరణం చెందిన డ్రైవర్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అపరాధ రుసుం పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేస్తామని చెప్పిన పాలకులు ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలని, 60 ఏళ్ల వయసు పైబడిన ఆటో డ్రైవర్‌కు సంక్షేమ బోర్డు నుంచి నెలకు రూ.8 వేలు పింఛన్ ఇవ్వాలని, మదనపల్లె, రాజంపేట, పీలేరు ఆర్డీవో కార్యాలయాల్లోనే ఎఫ్‌సీ సేవలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఫైనాన్సియర్ల ఆగడాలు అరికట్టి, ప్రభుత్వమే వాహనాలకు ఐదు శాతం వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, నరసింహులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గంగులప్ప, కరీముల్లా, వస్తాన్, రమణ, శివయ్య, నాగరాజు, చంద్ర, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

నీటిసంపులో పడి విద్యార్థి మృతి

- మిన్నంటిన కుటుంబీకుల రోదనలు





రోదిస్తున్న కుటుంబసభ్యులు, (ఇన్‌సెట్లో) నీటిసంపులో పడి మృతిచెందిన కళ్యాణ్

బి.కొత్తకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీటిసంపులో పడి ఓ బాలుడు తుదిశ్వాస విడిచిన దుర్ఘటన మంగళవారం బి.కొత్తకోట పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని పీటీఎం రోడ్డులోని ఆస్పత్రి సమీపంలో నివాసం వుంటూ తోపుడుబండిలో పళ్లవ్యాపారం చేసుకుంటున్న ఈశ్వరప్ప కుమారుడు కళ్యాణ్(8) సమీ పంలో వున్న ప్రభుత్వపాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకుంటా నని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. స్నేహితు లతో ఆడుకుంటూ రోడ్డుపక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోని నీటిసంపులో పడి పోయాడు. తమతో పాటు ఆడుకుంటున్న కళ్యాణ్ కనిపించక పోవడంతో పిల్లలు వెళ్లి బాలుడి తల్లితండ్రులకు తెలిపారు. దీంతో కుటుంబీకులు ఆచూకీ కోసం వెతకగా నీటిసంపులో పడివుండడాన్ని గమనించారు. హుటాహుటిన బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. దీంతో తల్లితో పాటు కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. బంధుమిత్రుల ఆర్త నాదాలతో ఆస్పత్రి ఆవరణం హోరెత్తింది. అకస్మాత్తుగా జరిగిన ఘటనలో బిడ్డను కోల్పో యిన తల్లిదండ్రులను ఓదార్చడం కష్టసాధ్య మైంది. ఘటనపై బి.కొత్తకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్టేషన్‌లోనే మహిళ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యశోద

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘంలో తీసుకున్న అప్పు డబ్బులు భర్త చెల్లించలేదని తనకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ మంగళవారం సాయంత్రం మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్‌కు వచ్చింది. అక్కడ పోలీసులు అప్పు మొత్తం తననే కట్టాలని చెప్పారంటూ ఆవేదనకు గురైన ఆమె వెంట తెచ్చుకున్న పురుగుల మందును పోలీస్‌స్టేషన్ వద్ద తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే బంధువులు ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు, పోలీసుల కథనం మేరకు.. నల్లగుట్లపల్లెకు చెందిన మల్లికార్జున భార్య యశోద లక్ష్మీవేంకటేశ్వర మహిళా గ్రూప్ లీడర్‌గా ఉంది. భర్తకు వైద్యం నిమిత్తం, ఇల్లు కట్టుకోవడానికి తమ గ్రూప్‌లో రూ.4 లక్షలు రుణం తీసుకుంది. అనంతరం భార్య భర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ద్వారా వారు విడిపోయారు. డ్వాక్రా రుణాన్ని భర్తే చెల్లించాలని ఆ సమయంలో చెప్పారు. ఇంటర్ చదువుతున్న కుమారుడు గణేష్, 13 ఏళ్లున్న కుమార్తె లిఖిత తండ్రి వద్దే ఉన్నారు. భర్త డ్వాక్రా రుణం చెల్లించకపోవడంతో గ్రూప్ సభ్యులు ఆమెను నిలదీశారు. దీంతో ఆమె భర్తపై ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వచ్చింది. అక్కడ సీఐ కళా వెంకటరమణ ఇది సివిల్ కేసు మీరు కోర్టులో తేల్చుకోమని సలహా ఇచ్చారు. కాగా.. ఇంట్లో ఉన్న బంగారు, డబ్బు ఆమె తీసుకెళ్లిందనేది భర్త ఆరోపణ. ప్రస్తుతం ఇల్లు తన పేరిట రాసి ఇవ్వాలనే దురుద్దేశంతో తనను బెదిరించడానికి ఇలా చేసిందని భర్త పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు...



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామం, దిగువ నంబూవారిపల్లె వాసి గోపి కుమారుడు అనిల్ డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్ద ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చెండకూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి ప్రథమచికిత్స కోసం తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపు కేసు నమోదు

ముద్దనూరు సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోడిగాండ్లపల్లె గ్రామానికి చెందిన కర్నాటి వరలక్ష్మిని ఆమె భర్త రమణారెడ్డి వేధింపులకు గురిచేస్తుండడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. అదనపు కట్నం కోసం రమణారెడ్డి, బంధువైన నాగలక్ష్మి వేధిస్తున్నారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని విద్యార్థి సుక్షిత్ (22) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, ఆరోగ్యవరం వాసులు సందీప్, తల్లి రుక్మిణీ కుమారుడు సుక్షిత్. కాగా 15 ఏళ్ల కిందట తండ్రి మరణించడం, తల్లి ఇల్లు వదిలి వెళ్లిపోవడంతో తన అవ్వ సుగుణమ్మ వద్దే ఉంటూ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజు కళాశాలల్లో అందరితో బాగా కలివిడిగా ఉండేవాడని మిత్రులు చెబుతున్నారు. అయితే ఏమైందో ఏమో మంగళవారం తెల్లవారుజామున ఆరోగ్యవరంలో తన అవ్వ ఇంట్లో బాత్ రూమ్‌లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం మదనపల్లె తాలుకా పోలీసులకు తెలియడంతో వారు సంఘటన స్థలం పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి మృతి అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వృద్ధుడు ..



వృద్ధుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సోమవారం పోలీసులకు సమచారం అందించారు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, సమాచారం కోసం వెదికారు. ఏమి లభించకపోవడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తమ బంధువుల కోసంగుర్తు తెలియని మృతదేహం వేచిఉంది. ఇతని వయస్సు సుమారుగా 80 ఏళ్లు ఉంటాయని, పెరిగి మాసిన గడ్డంతో, లుంగీ, షర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..



జయమ్మ (ఫైల్ ఫొటో)

కలకడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరాయ చెరువు-మర్రిపాడు మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు జయమ్మ (60) మృతి చెందినట్లు ఎస్ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కదిరాయచెరువు వాసి జయమ్మ పొలం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొందన్నారు. తీవ్ర గాయలపాలైన బాధితురాలిని 108లో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వివరించారు.

పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



పిడుగుపాటుకు ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కురబలకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లలో పిడుగుపాటుకు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి జరిగిన సంఘటన వివరాల్లోకెళితే... రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అయితే అర్ధరాత్రి కడపరోడ్డులో రోడ్డు పక్కన పిడుగు పడింది. దీంతో బ్రాహ్మణొడ్డుపల్లె, భారత్ కళ్యాణ మండపం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమవడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాగా ట్రాన్స్‌కో సిబ్బంది వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి మర మ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. తెట్టు పంచాయతీ మండ్యంవారిపల్లెలో వర్షానికి విద్యుత్ స్తంభం నేల కూలింది.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

కురబలకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కురబలకోట జడ్పీహైస్కూల్ విద్యార్థిని షహనాజ్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. కురబలకోట వాసి రఫీ కుమార్తె షహనాజ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మదనపల్లెలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైంది. కాగా విద్యార్థిని సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థిని ఎంఈఓ ద్వారకనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

బండ బరువులు మోస్తున్నా...

● శ్రమకు తగ్గ ఫలితం లేదు ● హమాలీల ఆవేదన



కమలాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీలు బండ బరువులు మోస్తున్నా వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడంలేదు. రేషన్ షాపులకు సంబంధించి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను దింపడం, ఎత్తడం వీళ్లు చేస్తుంటారు. గోడౌన్లలో అన్‌లోడింగ్ చేయడం, వాటిని తిరిగి వాహనాల్లోకి లోడు చేసి సంబంధిత చౌక ధాన్యపు డిపోల్లో దింపే పనులను వీరు చేస్తున్నారు. ఒళ్లు గుల్ల చేసుకుంటూ బరువులు మోస్తున్నా తమ కస్టానికి తగిన ప్రతిఫలం లేదంటూ హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమలాపురం హెడ్‌క్వార్టరులో స్టాకు పాయింట్లు ఉన్నాయి. ఇందులో 10 మంది హమాలీలు దాదాపు 10 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. గతంలో చౌక ధాన్యం దుకాణాల వద్ద నిత్యావసర వస్తువులను అన్‌లోడింగ్ చేసే సందర్భంలో డీలర్లు నేరుగా హమాలీలకు అన్‌లోడింగ్ చార్జీలు ఇచ్చేవారు. వీరికి క్వింటాల్‌కు లోడింగ్ అన్‌లోడింగ్‌కు కలిపి రూ.24లు ఇస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో థర్డ్‌పార్టీ ద్వారా బిల్లులను కార్మికుల ఖాతాల్లో వేసే పద్ధతి తెచ్చారు. కొన్ని నెలల తరువాత ఆ పద్ధతి ఆపి ఎవరైతే లారీ కాంట్రాక్టరు ఉంటారో వారి ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించారు. ఈ విధానంలో కార్మికులకు నెలనెలా సక్రమంగా బిల్లులు అందడం లేదని వాపోతున్నారు. గతంలో లాగా ఎఫ్‌ఎస్‌ఈ షాపుల వద్ద అన్‌లోడింగ్ సమయంలో నేరుగా డీలర్లే అన్‌లోడింగ్ చార్జీలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హమాలీలు కోరుతున్నారు. ఆన్‌లైన్ రూట్‌మ్యాపింగ్ అని చెప్పి షాపులు మార్చడం వల్ల షాపులు తగ్గి హమాలీలకు వేతనాలు తగ్గాయంటున్నారు. ఇలా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం బస్తాలను లోడింగ్, అన్‌లోడింగ్ చేయాల్సి రావడంతో హమాలీలకు ఇబ్బంది మారింది. గతంలో డీలర్ల వద్దనే మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బియ్యాన్ని దింపేవారు. పాఠశాలలు ఇరుకు ప్రాంతంలో ఉండడంతో దారిలేక లారీలు చాలాదూరంగా నిలుపుతున్నారు. ఇప్పటి వరకు వీళ్లకు కూలీ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



కష్టపడి పనిచేస్తున్న హమాలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. వీరిని ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ప్రతినెలా 5వ తేదీ వేతనాలు చెల్లించాలి. సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో హమాలీలపై పని వత్తిడి తగ్గించాలి. 12 రోజుల పని విధానాన్ని అమలు చేయాల్సి ఉంది. మృతి చెందిన హమాలీల కుటుంబాలకు రావాలసిన నష్టపరిహారం, బిల్లులు వెంటనే ఇవ్వాలి. ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేసి ఆదుకోవాలి.

- జి.నాగేశ్వర్‌రావు, ఏపీ సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకుడు

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భవ్య గుజరాత్‌యాత్ర

● సోమనాథ్, సబర్మతి వంటి పుణ్యక్షేత్రాలు,చారిత్రక ప్రాంతాలు దర్శనం
● తొమ్మిది రాత్రులు, పదిరోజుల ప్రయాణం
● ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వేణుగోపాల్



బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ అధికారులు, ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేశాఖలో భాగమైన ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భవ్య గుజరాత్ యాత్ర స్పెషల్ రైలును ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ తిరుపతి ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్ తెలిపారు. సోమనాథ్ జ్యోతిర్లింగాలు, సబర్మతి ఆశ్రమం వంటి పుణ్యక్షేత్రాలు , చారిత్రాత్మక ప్రాంతాలను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. భవ్య గుజరాత్ యాత్ర తొమ్మిది రాత్రులు, పది రోజులు కొనసాగుతుందన్నారు. మంగళవారం కడప రైల్వేస్టేషన్ వీఐజీ లాంజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబరు 7 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్ర స్పెషల్ రైలులో 639 మంది యాత్రికులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, సూర్యదేవాలయం, సబర్మతి ఆశ్రమం, రాణికివావ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను దర్శించే అవకాశం ఉంటుందని వివరించారు. అక్టోబరు 7 నుంచి 16 తేదీ వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. రేణిగుంట నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి రేణిగుంటకు చేరుకుంటుంది.

భోజన వసతి టికెట్ ధర వివరాలు

యాత్రికులకు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, వెజిటేరియన్ భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతో పాటు ప్రతి యాత్రికుడికి ప్రయాణ బీమా కల్పిస్తామని చెప్పారు. టికెట్ ధరలు స్లీపర్ క్లాస్‌కు రూ.18,400, 3వ ఏసీకి రూ.30,200, 2వ ఏసీకి రూ.39,900గా నిర్ణయించారన్నారు. కాగా, టికెట్ బుకింగ్ కోసం బి.యేసయ్య 9281495853, కె.పవన్‌కుమార్ 8287932313 సెల్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కడప రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, కమర్షియల్ అధికారి మోహన్‌దాస్, స్టేషన్ ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య, ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్ రద్దు

● ఉత్తుర్వులు జారీచేసిన ఆర్డీవో సాయిశ్రీ ● సంతోషం వ్యక్తం చేసిన బాధితులు



గిఫ్ట్‌డీడ్ రద్దు చేసిన ఉత్తుర్వులను సీనియర్ సిటిజన్లకు అందజేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ఒకే రోజు ముగ్గురు సీనియర్ సిటిజన్ల గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసి బాధితులకు న్యాయం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో తన కార్యాలయంలో సంబంధిత వృద్ధులకు వేర్వేరుగా ఉత్తుర్వులను అందజేశారు. ఇందుకు సంబంధించి ఆర్డీవో తెలిపిన వివరాల మేరకు... జమ్మలమడుగు ఆర్డీవో పరిధిలో నివశిస్తున్న ముగ్గురు వయోవృద్ధులు తమకు అవసరమైన సంరక్షణ, ఆహారం, వైద్యం, సహాయం అందిస్తారని ఉద్దేశ్యంతో వారి జీవిత కాలంలో సంపాదించి కూడబెట్టిన ఆస్తిని గిఫ్ట్‌డీడ్ కింద రాసిచ్చారు. అయితే తమ పిల్లలు తమను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆస్తులు తీసుకుని వదిలించుకోవాలని చూస్తున్నారని తమకు న్యాయం చేయాలంటూ బాధితులు నాలుగునెలల క్రితం ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో వృద్ధుల బాగోగులను సక్రమంగా చూడని వారి సంబంధీకులకు మెయింటినెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్టు 207 సెక్షన్ 23 ప్రకారం చర్యలు తప్పవని ఆదేశాలు జారీ చేయడంతో పాటు మూడు నెలలుగా వారివారి నివాస ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా చాపాడు మండలం చీపాడు గ్రామానికి చెందిన శ్రీయపురెడ్డి క్రిష్ణారెడ్డి (72) శ్రీయపురెడ్డి సరస్వతమ్మ దంపతులు తమకు అవసరమైన సంరక్షణ, ఆహారం, వైద్యం, సహాయం అందిస్తారని ఉద్దేశ్యంతో తమ కుమార్తె తిరుపతి సిద్ధకుమారి అల్లుడు వీరారెడ్డిలకు 2005 జూన్ 2న గిఫ్ట్ సెటిల్‌మెంట్ కింద 1.85 ఎకరాల భూమిని రాయించారు. అయితే వారికి అవసరమైన సంరక్షణ అందించలేదని, వైద్య ఖర్చుల కోసం బాధి తులు తమ నివాస గృహాన్ని విక్రయించాల్సి వచ్చిందని తమ విచారణలో తేలినట్లు ఆర్డీవో తెలిపారు. అలాగే జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎస్‌సీ బాలమ్మ (72) సైతం తన బాగోగులు చూస్తారన్న ఉద్దేశ్యంతో తన మూడవ కుమారుడు ఎస్‌సీ విశ్వనాథరెడ్డి, కోడలు పార్వతీకి 2022 సెప్టెంబర్ 9న 3.18 ఎకరాల వ్యవసాయ భూమిని రిజిస్టర్ చేయించారు. అయితే వృద్ధురాలికి వారి నుంచి సంరక్షణ లేదని విచారణలో వెల్లడైందన్నారు. అలాగే దువ్వూరు మండలానికి చెందిన జి.మహమ్మద్‌గౌస్ (74) సంతానం లేని కారణంగా తమ జీవితం చివరి దశలో తన సంరక్షణ ఎలా ఉంటుందోనని.. తన ఆస్తిని (ఇంటిని) సోదరుడి మనువడు మహమ్మద్ తాహీర్, అతని తల్లి గౌసియాకు 2022 డిసెంబర్ 13న గార్డియన్‌షిప్‌లో బహుమతిగా ఇచ్చారు. అయితే వీరి నుంచి బాధితులకు సంరక్షణ లేదని తమ విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు పై ముగ్గురు వృద్ధులకు సంబంధించిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశామని ఆర్డీవో తెలిపారు. దీంతో బాధితులు తమకు న్యాయం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ గిఫ్ట్‌డీడ్ అనేది వృద్ధులు తమ జీవితాంత సంరక్షణ కోసం ఇచ్చినప్పటికీ.. ఎవరైనా ఆస్తులు తీసుకుని ఇలాంటి ఇబ్బందులు కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను గౌరవించి వారి బాగోగులు చూసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, ఏవో ఇక్బాల్, బాష, రజియా తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మహిళ మృతి

● ఇరువురు యువకులకు గాయాలు

కడప క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగర పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక మహిళ మృతి చెందగా.. ఇరువురు యువకులు గాయపడ్డారు. కడప ట్రాఫిక్ ఎస్‌ఐ జయరాములు వివరాల మేరకు... ఖాజీపేట మండలానికి చెందిన ఆదిలక్ష్మమ్మ (60) సొంత పని నిమిత్తం కడపకు వచ్చి తిరిగి బైకులో ఖాజీపేట వెళుతుండగా రెండో గాంధీ బొమ్మ వద్దకు రాగానే ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోసుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. అలాగే కడప మాసాపేటకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బిల్టప్ సర్కిల్ వద్ద మైదుకూరు నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగమణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అలాగే నాగరామ్ గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'గంగ' కాల్వలో యువకుడి మృతి



కలసపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లారెడ్డిపల్లె దారిలో అంకాళమ్మ గుడి వద్ద ఉన్న తెలుగు గంగ కాల్వలో మంగళవారం స్నానానికి వెళ్లి ఆరవేటి సుబ్రహ్మణ్యం (30) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకెళితే... ప్రకాశం జిల్లా కంభం మండలం చిన్నకంభం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం గత కొద్దిరోజుల నుంచి కలసపాడుకు చెందిన ఓ మేస్త్రీ వద్దకు కూలీ పనులకు వెళ్తున్నాడు. మంగళవారం పనులు లేకపోవడంతో తెలుగుగంగ కాల్వలో తన బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లి.. తర్వాత స్నానానికి దిగాడు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ఖాజీపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆంజనేయపురంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఘర్షణలు లేని గ్రామాలు ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించుకోవాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఏదైనా ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి రాకుంటే న్యాయసేవాధికారి సంస్థను సంప్రదించాలన్నారు. నిర్బంధ విద్య, రేషన్‌కార్డులు, సదరంసర్టిఫికెట్, పెన్షన్లు, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, లిటిగేషన్ కేసులు, బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, వికలాంగుల పెన్షన్లు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైదుకూరు సివిల్‌జడ్జి ఖాజామొహిద్దీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఇర్విన్, డీఎస్పీ రాజేంద్రప్రసాద్, తహసీల్దారు ఏవీ రవణమ్మ, సీఐ వంశీధర్, సర్పంచ్ చంద్రశేఖర్, న్యాయవాదులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు మస్కా

● రూ.10లక్షలతో రీసోర్స్ పర్సన్ పరార్
● పోలీసులను ఆశ్రయించిన సంఘం సభ్యులు



పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన డ్వాక్రా సంఘం మహిళలు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపుల్లో కూడా మోసాలు, అవినీతికి పాల్పడుతున్నారు. బద్వేలు మెప్మాలో అనేక అవకతవకలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సంఘాల్లో ఉండే సభ్యులకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో మెప్మాలోని రీసోర్స్ పర్సన్‌ల ద్వారా సంఘాలను నడిపిస్తుంటారు. బ్యాంకుల్లో లోన్లు తీసుకోవాలన్నా, కట్టాలన్నా ఆర్పీలే కీలకం. అయితే బద్వేలు మున్సిపాలిటీ పరిధి లోని గౌరీశంకర్‌నగర్‌లో నివాసం ఉండే మహిళలు 10మంది కలసి సరస్వతి గ్రూపు, శంకర్‌గ్రూపు అనే పేరుతో పొదుపులో ఉన్నారు. అయితే ఆ గ్రూపు ఆర్పీ ఆ మహిళలను బురిడీ కొట్టించి రూ.10లక్షలతో ఉడాయించింది. గ్రూపు సభ్యులు అడిగితే మాటదాటేస్తూ తనకు రాజకీయ అండదండలు ఉన్నాయంటూ బెదిరిస్తూ ఉన్నట్లుండి ఒక్కసారిగా డబ్బుతో ఉడాయించింది. బయటకు మాత్రం రూ.10లక్షలు కనపడుతున్నా.. ఎన్ని లక్షల రూపాయలు స్వాహా చేసిందో తెలియదని.. అధికా రులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే నిజాలు తెలుస్తాయని గ్రూపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మెప్మా అధికారులకు ఈ వ్యవహారం తెలిసినప్పటికీ కప్పిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పొదుపు సంఘాల మహిళలు బద్వేలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయ గా, కేసు నమోదు చేయకపోవడంపై ఆంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి నిజానిజాలు తేల్చాలని కోరుతున్నారు.

ఆంధ్ర యువసంకల్ప డిజిటల్ మారథాన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర యువ సంకల్ప 2025 డిజిటల్ మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈవో ఐజె విజయకుమార్ తెలిపారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా యువతకు సృజనాత్మకత ఆవిష్కరణ, బాధ్యతలు వేదికగా వీడియోలను డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఆంధ్ర.యువసంకల్ప.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సామాజిక బాధ్యత, ఫిట్‌నెస్ మరియు క్రీడలు, డిజిటల్ ఇన్నోవేషన్ అంశాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తిగల 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉన్న యువత పై తెలిపిన వెబ్‌సైట్‌లో ఈనెల 30లోపు నమోదు చేసుకుని సంబంధిత వీడియోను అప్‌లోడ్ చేయాలన్నారు.

వైవీయూలో ముగిసిన ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థుల బోధన నైపుణ్యత, అర్హతలను పరిశీలించారు. ఇంటర్వ్యూలలో సబ్జెక్టు నిపుణులు అనంతపురం ఎస్‌కెయూ నివర్సిటీ ప్రొఫెసర్ ఎంవీ శ్రీనివాసన్, వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డీన్‌లు ప్రొఫెసర్ పి.రమాదేవి, ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ అధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు



జమ్మలమడుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులో ఎస్‌ఆర్ పెట్రోలు బంకు సర్కిల్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం బండ్లమూరి డానియేల్ అనే వ్యక్తి చెట్టుకింద నిద్రపోతుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన డానియేల్ ప్రొద్దుటూరుకు వెళుతుండగా నిద్ర వస్తుండటంతో స్కూటర్ పక్కనే పెట్టి బండపై నిద్రపోయాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తల, చేతులపై దారుణంగా కొట్టి సెల్, స్కూటర్ లాక్కుని వెళ్లిపోయారు. స్థానికులు అతన్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శివాలయంలో చోరీ



సీసీ పుటేజీలో కనిపిస్తున్న దొంగ

చక్రాయపేట,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభిరెడ్డివారిపల్లె సమీపాన వెలసిన శివాలయంలో మంగళవారం మధ్యాహ్నం శివాలయంలో చోరీ జరిగినట్లు అర్చకులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలకు వెళితే.... ఆలయ పూజారులు ఉదయం పూజలు ముగిసిన తర్వాత గర్భాలయానికి తలుపులు వేసి వెళ్లారు. ఆ సమయంలో దొంగ కటాంజనాన్ని రాడ్‌తో నెట్టి ఆలయంలోకి ప్రవేశించాడు. ప్రాంగణంలో ఉన్న హుండీలోని దాదాపు రూ.50వేల వరకు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సీసీ పుటేజీలో దొంగ స్పష్టంగా కనిపిస్తున్నాడు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

దువ్వూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు, మీర్జఖాన్‌పల్లె పరిధిలో అయిదు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు మంగళవారం విద్యుత్తు శాఖ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. బుచ్చిరంగడు, పట్టాభిరామయ్య, బుచ్చెయ్య, రాంప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి అనే రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని చెప్పారు. ఈమేరకు స్థానిక ఎస్‌ఐ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎదురీదుతున్న కర్నూలు, కడప జట్లు



నికిత్‌గౌడ్, మహేంద్రరెడ్డి, వికాస్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ 23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం కర్నూలు, కడప జట్లు ప్రత్యర్థి జట్ల కన్నా వెనకంజలో ఎదురీదుతున్నాయి. వివరాలిలా..

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 103.3 ఓవర్లలో 454 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో నికిత్ గౌడ్ 153 పరుగులు, బాలాజీ 59 పరుగులు చేశా రు. కాగా, కర్నూలు జట్టు బౌలర్ ఖనిష్ ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన కర్నూలు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 218 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 236 పరుగుల లోటుతో ఎదురీదుతుంది.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్టు మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 150.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 537 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మహేంద్రరెడ్డి 239 పరుగులు, వికాస్ 109 పరుగులు చేశారు. అనంతరం భారీ స్కోరు లక్ష్యాన్ని అందుకునే క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. ఇందులో విజయ్‌రామిరెడ్డి 59 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో కడప జట్టు మరో 428 పరుగుల వెనుకంజలో ఉంది.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలి

బాధ్యతతో పనులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు ● సీహెచ్‌సీ, హైవే కాంట్రాక్టర్లు, అధికారులపై ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆగ్రహం

చెన్నూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచేటట్లుగా చూడాలని, ఇందుకోసం ప్రతి అధికారి బాధ్యతాయుతంగా ప్రజలకు జవాబు దారితనంగా పనిచేయాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో మండల పరిషత్ సర్వసభ్యసమావేశం మంగళవారం ఎంపీపీ చీర్ల సురేశ్ యాదవ్ ఆధ్వర్యం లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో పనులు ఇంకా పూర్తి కాక పెండింగు ఉండడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీహెచ్‌సీని ఏడాదిన్నర క్రితం ప్రారంభించామని చెప్పినా ఇంకా ఎందుకు పనులు పూర్తి కాలేదని కాంట్రాక్టరును ప్రశ్నించారు. సీహెచ్‌సీ పూర్తయ్యేం దుకు ఒక తేదీ అంటూ లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎప్పటికి పూర్తిచేస్తారో తనకు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

అఫిషియల్‌గా లెటరు ఇవ్వాలన్నారు.అలాగే హైవేలో ప్రమాదాలు జరుగుతున్నాయని సర్వీసు రోడ్లు వేయలేదు. బస్‌షెల్టర్లు కట్టలేదు, డ్రైనేజీ కడతారో లేదో తెలియని పరిస్థితి ఉందని అడిగినప్పుడల్లా సమావేశాల్లో హైవే సిబ్బంది ఒక్కోమారు ఒక్కొక్కరు రావడం, వాయిదాలు తీసుకోవడం తప్ప ఎప్పుడు పనిచేస్తారని హైవే సిబ్బందిని ప్రశ్నించారు. మీ ఇష్టానుసారంగా పనులు చేయకుండా వాయిదాలు వేస్తే కుదరదన్నారు. అలాగే గోప వరం-శివాలపల్లె తాగునీటి పరిష్కారానికి శాశ్వతం గా ఏదోక పనిచేయాలని పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగు సిబ్బందికి సూచించారు. కనుపర్తి లేఅవుట్‌లో ఇంకా ఎందుకు ఇంటి నిర్మాణాలు పూర్తికాలేదని ప్రశ్నించారు. శివాలపల్లె, కొండపేట సర్పంచ్‌లు తుంగాచంద్ర యాదవ్, సుదర్శనరెడ్డి మాట్లాడుతూ సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఒకే చోట కాకుండా రెండు గ్రామాల్లో ఉండే ట్లు చూడాలని కోరారు. కాగా మండల స్థాయి అధికారులు తమ శాఖల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ ముండ్లశ్రీనివాసులరెడ్డి, ఎంపీడీవో కిరణ్‌మోహన్ రావు, తహసీల్దారు సరస్వతి, ఆర్.సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో' పై అవగాహన

కడప క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో గల జీఎంఆర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో నార్కోటిక్ సెల్ ,ఈగల్ సెల్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌లో భాగంగా పాఠశాలకు 100 మీటర్లకు దూరంలో దుకాణదారులు ఎవరూ కూడా పొగాకు, బీడీ, సిగరెట్లు ,గుట్కాలు, ఖైనీలు ఇటువంటివి అమ్మితే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

అన్నదానం

కడప సెవెన్‌రోడ్స్,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎంఆర్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో మంగళవారం స్థానిక గురూజీ వానప్రస్థాశ్రమంలోగల అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశి భూషణ్‌రెడ్డి హాజరై అన్నదానంచేశారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా మంత్రి సత్యకుమార్ సేవలందిస్తున్నారన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ హమాలీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డులోని సివిల్ సప్లయ్ గోడౌన్‌లో హమాలీల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ హమాలీ కార్మికులు అందిస్తున్న సేవలకు ప్రభుత్వం నుంచి నేటికి గుర్తింపు లేదని, ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, బాల గురువయ్య, మురారి, ఉపాధ్యక్షులు శ్రీరాములు, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, శరత్, కోశాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

డ్రోన్‌తో డబ్బు, సమయం ఆదా

చెన్నూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాలకు పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో డ్రోన్‌ను ఉపయోగించుకుంటే సమయం ఆదా కావడంతో పాటు డబ్బు వృథా కాదని, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. చెన్నూరులో మంగళవారం డ్రోన్‌ను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏవో శ్రీదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, పాలగిరి పెద్ద సుబ్బారెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఖాజాహుసేన్, చిన్నయ్య, ఆకుల చలపతి, అల్లాడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి - జేడీఏ

సీకేదిన్నె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఓబుళంపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవో ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి రామమోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టీకాలతోనే గాలికుంటు వ్యాధి నివారణ

పెండ్లిమర్రి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారానే నివారణ సాధ్యమని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు శ్రీధర్ లింగారెడ్డి తెలిపారు.గోపాల పురం,ఏనుగువారిపల్లె, నంది మండలం గ్రామాలలో మంగళవారం వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టి 700 పశువులకు టీకాలను వేశారు.ఏడీ డాక్టర్ మాధవి, పెండ్లిమర్రి,నందిమండలం పశువైద్యులుసురేష్,రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంభిస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం కడప కలెక్టరేట్ ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టింది. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాష, జిల్లా కార్యదర్శులు సుబ్బారెడ్డి, చిన్నగురయ్య, జిల్లా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించండి


ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు-అమరావతి ఎక్స్‌ప్రెస్ వేలో వేముల మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం వేముల మండలంలో జరుగుతున్న హైవే నిర్మాణ పనుల వద్ద నిర్మాణసంస్థల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ముందుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, టీడీపీ నాయకుడు మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ మీడియాన్ని ప్రవేశపెట్టాలి..: బాలికల జూనియర్ కళాశాల,మహిళా డిగ్రీ కళాశాలల్లో ఉర్దూ మీడియం ప్రవేశపెట్టాలని ఆయా కళాశాలల అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసివారు వినతిపత్రం సమర్పించారు.

నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా రత్నం



వేంపల్లె,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా వీవీ రత్నం ఎంపికయ్యారు. ఆ సంఘం ఎన్నిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. గతంలో నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా పనిచేసిన రత్నం మళ్లీ ఎన్నికల్లో మరోమారు ఎన్నికయ్యారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు


సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు లక్షుమయ్య, వాజ్‌పేయి, తిరుపాల్‌రెడ్డి, లింగాల మండల కన్వీనర్ విష్ణుయాదవ్, అనిల్‌కుమార్, జేసీ రామాంజనేయులు, తరుణ్,అజయ్, టోపీ బాష, బాలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి రూ.50వేలు వితరణ



వేంపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని భవిత కేంద్రంలో ఉన్న దివ్యాంగుల సంక్షేమానికి విశ్రాంత మండల విద్యాశాఖ మంత్రి రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.50వేలు వితరణగా ఇచ్చారు. ఆయన మనువరాలు వైద్య దంపతులు అరుణ, హరికిరణ్‌రెడ్డిల కుమార్తె ధృతిసాయి పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఎంఈఓ వెంకటరామిరెడ్డి, ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి, ఎంఈఓ-2 ఐజాక్ చేతులమీదుగా రూ.50వేలను ఐఈఆర్టీలు యశోద,సుజాతల చేతికి అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చావలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

వేంపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తాళ్లపల్లె వైద్యాధికారి సుభాషిణి తెలిపారు. వేంపల్లెలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుగుణమ్మ పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారిద్దాం

వేంపల్లె,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పొర దెబ్బ తినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్త తెలిపారు. ఓజోన్ డే పురస్కరించుకొని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 8,14,1వ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్,రమేష్, దీప్తి, తిరుపతిరెడ్డి, అనిత పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

లింగాల,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయితీలకు పంటనమోదు తప్పనిసరని ఏఓ రమేశ్ అన్నారు. మండలంలోని లింగాల, లోపట్నూతల గ్రామాలలో ఆయన మంగళవారం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈనెలాఖరులోగా రైతులందరూ ఈ-క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలని తెలిపారు.

రణభేరిని విజయవంతం చేయండి

వేంపల్లె,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేంపల్లెలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19వ తేదీ వరకు రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నేతలు శ్రీనివాసులు,రమణ, అహ్మద్, కృష్ణారెడ్డి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

20న ధర్నా

పులివెందుల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల కుటుంబాలు ఈనెల 20వ తేదీన తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ పులివెందుల గౌరవాధ్యక్షుడు గఫూర్, పులివెందుల కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు



కడప సెవెన్‌రోడ్స్ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అమ్మవారి సన్నిధికిచేరుకొని నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించారు. ఈనెల 22 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు ఆలయంలో విజయదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయని ఆలయ నిర్వాహకులు మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి : డీవైఎఫ్ఐ

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం జ్వరాలు ఎక్కువ అవుతున్న తరుణంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఇదే అదునుగా చూసుకొని ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విషజ్వరాలు బారినపడిన ప్రజలుతీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఇటువంటి పరిస్థితిని జిల్లాలోని కొన్నిప్రైవేటు ఆసుపత్రులు రకరకాల టెస్టులపేరుతో పరీక్షలు నిర్వహించి చికిత్స కోసం ప్రజల వద్ద నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇదే అదునుగా చూసుకున్న డయాగ్నొస్టిక్ సెంటర్లు కూడా అధిక ఫీజులు టెస్టులకు వసూలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నగరకార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

'మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం సిగ్గుచేటు'



నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి,జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని తెలిపారు. మంగళవారం కడప అంబేడ్కర్ సర్కిల్లో ప్రైవేటటీకరణను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోనిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు జాలా సుమంత్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అఖిలేష్, నాయకులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై లక్ష సంతకాల సేకరణ

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి



కడప కలెక్టరేట్,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బీజేపీ సర్కారు ఓటు చోరీకి కుట్ర పన్నిందని, ఎన్నికల కమిషన్ కూడా ఓటు విలువ చాటి చెప్పకప్రజా స్వామ్యంలో ఓటు విలువ గల్లంతు కానుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఓట్ల గల్లంతును, ఎన్నికల కమిషన్ అవకతవకలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. కాగా మంగళవారం నుంచి జిల్లా,నియోజక, మండల కేంద్రాల్లో ఓటు విలువ చాటి చెప్పేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ లక్ష మందితో సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నగర అధ్యక్షుడు సయ్యద్ గౌస్‌పీర్,జిల్లాఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, కమలాపురం, పులివెందుల, ప్రొద్దుటూరు నియోజక వర్గఇన్‌చార్జీలు అశోక్‌కుమార్ రెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాషా, దాసరి శ్రీనివాసులు,దినకర్,ముబారక్, యూసఫ్,అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు రుణాలు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లింకేజీ , బయోమెట్రిక్ డిజిటల్ ఎంసీపీ ద్వారా ఎస్‌హెచ్‌సీలకు రుణాలను ఇప్పించడం జరుగుతుందని ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపీఎం, సీసీలకు, వీఓఏలకు, సిబ్బందికి, మీటింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం 35 డివైజ్‌లను పీడీ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, సీసీలు, ఎంఎస్‌ఓబిలు అకౌంటెంట్లు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థనారీ - సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా యన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం కింద ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేచే ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నెలరోజులుగా పనిచేయని

బీఎస్ఎన్ఎల్ టవర్



చక్రాయపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీఎస్ఎన్ఎల్ టవర్లు నెలరోజులుగా మూగబోయాయి. ఫలితంగా వినియోగదారులు విసుగెత్తిపోతున్నారు. బీఎస్ఎన్ఎల్‌తో చాలా ఇబ్బందిపడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. నాగిరెడ్డిపల్లె, చిలేకాంపల్లె, లక్ష్మీపురంలో నాలుగు టవర్లు ఉన్నాయి. ఏరోజూ సక్రమంగా పనిచేసిన పాపాన పోలేదు. అయితే అక్కడ పనిచేస్తున్న అధికారులు నిర్లక్ష్యం వైఖరితో ఉన్నారని వినియోగదారులు అంటున్నారు. నెలల తరబడి పనిచేయకుండా పోవడం బాధాకరమన్నారు. మెరుగైన సౌకర్యం కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని స్పష్టమవుతోందన్నారు. కాగా బీఎస్ఎన్ఎల్ పనిచేయకపోవడంపై జేటీడీ జూనియర్ లైన్‌మన్ మునిప్రసాద్‌ను వివరణకోరగా సిస్టం మెయింటెనెన్స్ చెడిపోయిందని, పైఅధికారులకు తెలియజేశామన్నారు.

అంధకారంలో ప్రధాన రోడ్డు

● పట్టించుకోని అధికారులు



చీకటిలో బాలికల ఉన్నత పాఠశాల రోడ్డు



వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో అంధకారంగా ఉన్న ప్రధాన రోడ్డు

ముద్దనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముద్దనూరు టౌన్‌లో ప్రధానరోడ్డులో వీధి దీపాలు అమర్చకపోవడంతో రాత్రివేళ అంధకారం నెలకొంది. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ వివరాల్లోకి వెళితే... ముద్దనూరు టౌన్‌లో దాదాపు ఆరు నెలలుగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పాత విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. పాత బస్టాండు నుంచి రైల్వే గేట్లు, బాలికల ఉన్నత పాఠశాల రోడ్డులో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైను లాగి కూడా నెలరోజులు కావొస్తోంది. అయినా ఇప్పటి వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రధాన రహదారుల్లో అంధకారం ఏర్పడింది. రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండటంతో రోడ్డు క్రాసింగ్ కల్వర్టు పనులు చేస్తున్నారు. చాలా చీకటిగా ఉండటంతో రాత్రివేళ వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఎటువంటి ప్రమాదం జరుగకముందే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలి : భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, అందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎర్రగుంట్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి కమిటీలు, బూత్ కమిటీలపై చర్చించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, కో ఆర్డినేటర్ ఎం.మోహన్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకులు, కార్తకర్తలతో మంగళవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సమావేశమయ్యారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పలు సమస్యల గురించి చర్చించారు. అనంతరం దత్తాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయన వెంట కూటమి మండల ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వేయింగ్ మిషన్ల తనిఖీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్ మాట్లాడారు. ఏడాదికి ఒకసారి తూకాలకు సంబంధించిన తేడాలపై మిషన్లను పరిశీలించడం జరుగుతుందన్నారు. రేషన్ డీలర్లు ప్రజలకు అందజేస్తున్న బియ్యం, చెక్కర, జొన్నలు తదితర వస్తువుల్లో తూకాలు తక్కువ రాకుండా ఈ పరిశీలన చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లోకకల్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గోపూజ, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

యూరియాను తక్కువగా వాడాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యూరియాను తక్కువ మోతాదులో వినియోగించాలని, అలాగే నానో యూరియా కూడా ఉపయోగించుకుంటే పంటలకు మంచిదని వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని టేకూరుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సూక్ష్మ పోషకాల వాడకం, పీఎం కిసాన్, రైతు భరోసా, బిందు సద్యం, వివిధ రకాల పంటల్లో తీసు కోవలసిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి చంద్రమోహన్‌రెడ్డి, వీఏఏ పద్మ పాల్గొన్నారు.

అవసరం మేరకు వాడాలి

ముద్దనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పంటలకు అవసరం మేరకు యూరియాను వాడాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని యామవరం, చింతకుంట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచను చేశారు. ప్రతి పంటకు శాస్త్రవేత్తలు సూచించిన మేరకు యూరియా వాడుకోవాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలన్నారు. జిప్సం రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. ఎరువులు, విత్తనాలు కొన్నప్పుడు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

● సాగు, తాగునీటిని సకాలంలో అందించాలి

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు, మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా, ప్రతి గ్రామంలో తాగునీటిని అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. అలాగే రాబోవు రోజుల్లో అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు, అధికారుల సహాయ సహకారాలతో మండలాన్ని అభివద్ధి బాటలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు గత మూడునెలల నుండి జరిగిన ప్రగతి నివేదికను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరకిశోర్, ఎంఈవో పుల్లయ్య వెలుగు ఏపీయం ఓబులేసు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.







దళిత కాలనీ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కాలనీవాసులతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీవో శివారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దళిత కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. ఆ ప్రాంతంలో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషపురుగులతో ప్రజలు భయపడుతున్నారని, సమస్యలపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. దళిత కాలనీ పట్ల వివక్ష చూపడం సరికాదని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాంప్రసాద్, లక్ష్మీనారాయణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర కార్యదర్శిగా తవ్వా సురేశ్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గంలో ప్రొద్దుటూరు నుండి ముగ్గురికి చోటు దక్కింది. 14వ తేదీ ఆదివారం విజయనగరంలో జేవీవీ 18వ మహాసభలను నిర్వహించారు. ఈ మహాసభలలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తవ్వా సురేష్‌రెడ్డి, రాష్ట్ర యూత్ అండ్ సోషల్ మీడియా సబ్ కమిటీ కన్వీనర్ పువ్వా మహేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎన్.సునీతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. జేవీవీ నాయకులు అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం రెండవరోజూ మెయిన్ గేటు వద్ద పెద్దఎత్తున ఆందోళన చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఉద్యోగ, కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 22వ తేదీవరకు ఆందోళన కొనసాగిస్తామని, ఆ తరువాత యాజమాన్యం స్పందనపై ఆధారపడి ఉంటుందన్నారు. డీఏలు వెంటనే ఇవ్వాలని, కార్మికుల పాత బకాయిలు చెల్లించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బద్వేలు రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి మనోహరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక గర్ల్స్ హైస్కూలు ఆవరణంలో ఉన్న బాలికల సంక్షేమ వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని పరిశీలించి శుభ్రంగా వంట చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్డుపక్కనే ఉన్న మురికికాల్వలపై మూతలు ఏర్పాటు చేయాలని సచివాలయ సెక్రటరీలకు సూచించారు. అనంతరం బాలికల ఉన్నతపాఠశాలను పరిశీలించి విద్యార్థినులకు వ్యక్తిగత శుభ్రత, హ్యాండ్‌వాష్‌పై వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సౌమ్య, సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, హెల్త్ అసిస్టెంటు శ్రీరాములయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

బి.కోడూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో మల్లీశ్వరి అన్నారు. మంగళవారం ఎంపీడీవో సభాభవనంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జాన్ కెన్నడి, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

ఖాజీపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తుడుములదిన్నె వంకలో బండి, ఎద్దులు కొట్టుకుపోయిన రామిరెడ్డి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మంగళవారం రూ.72 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో సర్వేనెం.418లో 13.40ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇది ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల నరసింగపల్లెలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించగా మంగళవారం అక్కడ వీఆర్వో ఓబులేసు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

రంగసముద్రం చెరువులో సర్వే

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం చెరువులో ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు బద్వేలు రెవెన్యూ డివిజనల్ సర్వేయరు రఘురామయ్య నేతృత్వంలో మంగళవారం సర్వే నిర్వహించారు. గతంలో సర్వే చేసి చూపిన హద్దులపై అనుమానాలు ఉన్నాయని కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే చేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు నీటి సంఘం చైర్మన్ చెరుకూరి వీరచెంద్రాయుడు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుగంగ నీటిపారుదలశాఖ ఇంజనీరు సుజని, సర్వేయరు సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

కలసపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పని చేయాలని ఎంపీపీ నిర్మలాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహబూబ్‌బీ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మురళీ మోహన్, మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ సింధుజ పాల్గొన్నారు.

యూరియా కొరత రాకూడదు

ఖాజీపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడా యూరియా కొరత రాకూడదని డీఎల్‌పీవో, డీడబ్ల్యుఎంఏ విజిలెన్స్ అధికారి జుబేదా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అప్పనపల్లి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఫెర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి నాగార్జున, పంచాయతీ సెక్రటరీ భాగ్యశ్రీ, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల పత్రిక ఆవిష్కరణ

జమ్మలమడుగు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం దసరా శరన్నవరాత్రులకు సంబంధించి ఆహ్వాన పత్రికలను ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులు ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కమిటీ ప్రధాన కార్యదర్శి వెంగయ్య, వాసవీ క్లబ్ అధ్యక్షుడు శరణా వెంకటకిశోర్, యువజన సేవా సంఘం అధ్యక్షుడు సుమన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి



వాటర్‌సప్లై సిబ్బందికి సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నీటి సరఫరాలో లీకేజీలు లేకుండా నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో నీరు సరఫరా చేసే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి సూచనలు చేస్తూ ఎక్కడా కూడా లీకేజీలు కాకుండా చూడాలన్నారు. తరచుగా క్లోరిన్ టెస్ట్ చేయడంతో పాటు కుళాయిల దగ్గర, పైపు జాయింట్ల దగ్గర లీకేజీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమ కుళాయిలు రెగ్యులర్ చేయించుకునేలా ప్రజలకు వివరించాలని, నీటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఇంజనీర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

మైదుకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డిప్యూటి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి.మల్లేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఆర్ఎంపీలకు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. ఆర్ఎంపీలు ప్రథమచికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డు పెట్టుకోవాలని, వారి పేరు ముందు డాక్టర్ అనే పదాన్ని ఎట్టి పరిస్థితిలోను ఉపయోగించకూడదన్నారు. తమ కేంద్రాలలో చిన్నపాటి గాయాలకు, రోగాలకు, సాధారణ సమస్యలకు ప్రాథమిక మందులను మాత్రమే ఇవ్వాలన్నారు. వైద్య ఆరోగ్యం పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్, గుండెజబ్బులు, కిడ్నీ సమస్యలు వంటి వాటికి చికిత్స చేయకూడదన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రథమచికిత్స కేంద్రాన్ని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఓజోన్ పొర సంరక్షణ మన బాధ్యతే'

పోరుమామిళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను సంరక్షించుకునే బాధ్యత మనదేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు అన్నారు. మంగళశారం స్థానిక కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజెన్ పొర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ కరుణాకర్ ఓజోన్ పొర ప్రాధాన్యత, ఎలా కాపాడుకోవాలనే విషయాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూర్యుని నుండి వచ్చే హానికర అల్ట్రా వయిలెట్ కిరణాలను శోషించి జీవాలను రక్షిస్తుందన్నారు. విద్యార్థులు పర్యావరణ హితమైన అలవాట్లు అలవరచుకోవాలని, హానికర స్ప్రేలు వాడరాదని, ప్లాస్టిక్ దహనం తగ్గించాలని, చెట్లు పెంచాలని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల ఓజోన్ పొరను రక్షిం చగల మన్నారు. అనంతరం పండ్ల మొక్కలను బొటానికల్ గార్డెన్‌లో నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహారెడ్డి, సులోచన పాల్గొన్నారు.

'స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్'ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారులు

కాశినాయన, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నేటి నుండి ప్రారంభం కానున్న స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్ప తెలిపారు. మంగళవారం నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమంపై వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో జరుగుతుందన్నారు. సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు భాగస్వాములై స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, పీహెచ్ఎన్ శారద,హెచ్ఎస్ బాలయ్య, హెచ్ఏ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని మహిళలు ఆరోగ్యంగా ఉంటే దేశం బాగుంటుందనే సంకల్పంతో చేపట్టిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని బుధవారం ఉదయం మండల పరిధిలోని గోపవరం ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొనే మహిళలు, కౌమారబాలికలు, చిన్నపిల్లలు తమ ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి : డీఎల్‌డీవో

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని డీఎల్‌డీవో అంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, రోడ్డు పనులపై ఆరా తీశారు. సర్వే పనులు, ఎస్ఏఎస్‌ఏ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోఆర్డీ రంతుల్లయ్య, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ

బద్వేలు రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జన్మదినం సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు కొలిశెట్టి రమణయ్య, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొలిశెట్టి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీమాంక్ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్డు, జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ సీమాంక్ ఆసుపత్రిని వంద పడకలతో అభివృద్ధి చేసేందుకు మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సీమాంక్ వైద్యుడు శ్రీకాంత్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసబ్బయ్యరాయల్, ఉపాధ్యక్షురాలు తుడిమెళ్ల వీరలక్ష్మి, శ్రీనివాసకుమార్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబంలో వెలుగు నింపిన మానవ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిస్సహాయ స్థితిలో రైల్వే స్టేషన్‌లో నివాసం ఉంటూ.. పిల్లల చదువు అర్ధాంతరంగా ఆగిపోయిన ఓ కుటుంబానికి ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద ఆర్థిక సహాయం అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ఎర్రగుంట్లకు చెందిన కె.అఖిల, కొండారెడ్డి కొన్నేళ్ల క్రితం హైదారాబాదుకు వెళ్లి అక్కడ ఓ హోటల్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఓ యాక్సిడెంట్ కారణంగా కొండారెడ్డి మంచానపడ్డాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో రైల్లో ఎర్రగుంట్లకు వచ్చి రైల్వేస్టేషన్‌లో నివాసం ఉంటున్నారు. అరకొర డబ్బులతో అన్న క్యాంటీన్‌లో కడుపునింపుకుంటున్నారు. ఈ విషయం మంగళవారం ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవాసంస్థ దృష్టికి రావడంతో త్రివేణి విద్యకు ఆటంకం లేకుండా హాస్టల్ ఫీజు చెల్లించారు. వారు చిరువ్యాపారం చేసుకునేందుకు మరో రూ.9వేల ఆర్థిక సహాయం చేశారు. అలాగే హైదరాబాదు కళాశాల యాజమాన్యంతో మాట్లాడి ఫీజులు విషయంలో కరుణ రూపాలని కోరారు.